ఈరోజు (10 జూలై ) జరిగిన విలేకర్ల సమావేశంలో సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు యం.ఏ.గఫూర్ లు పాల్గొన్నారు. సమావేశ వివరాలు ప్రచురణార్థం/ ప్రసారార్థం మీకు పంపుతున్నాము. - జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

# ప్రజా సమస్యలు విస్మరించిన ప్లీనరీ
# సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
# కేంద్ర విద్రోహాన్ని గుర్తించని వైసిపి - యం.ఏ.గఫూర్
# ప్రత్యేకహోదా, విభజన హామీల ఊసే లేని ప్లీనరీ
# భారాలు, వాగ్దాన భంగంపై వైసిపి వివరణ ఇవ్వాలి.

రాష్ట్రం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడంలో ప్లీనరీ వైఫల్యం చెందిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అధికార వైఎస్ఆర్‌సిపి రెండురోజులపాటు నిర్వహించిన ప్లీనరీలో ఏ మాత్రమూ ఆత్మపరిశీలన లేదని, స్వోత్కర్షతో ముగిశాయని తెలిపారు. ఇచ్చిన హామీల అమలు 95 శాతం అమలు జరిపామన్నామని ముఖ్యమంత్రి ఈ కాలంలో పడిన అదనపు భారాలు, వాగ్దాన భంగం గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. ప్రజలు ఇబ్బందులకు పరిష్కారం చూపిస్తారేమో అని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. 2019 నాటి వాగ్దానాల గురించి మాట్లాడిన సిఎం 2022 నాటి సమస్యలను గుర్తించలేదన్నారు. లక్షల మంది ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. ముఖ్యంగా సిపిఎస్, ప్రత్యేక హోదా, కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీము వర్కర్ల మున్సిపల్ కార్మికుల వేతనాలు, ఆరోగ్యశ్రీ, విభజన హామీలు, స్థానిక సంస్థల హక్కులు, నిధులు, భూపంపిణీ వంటి సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. వీటికితోడు గ్యాస్, విద్యుత్, పెట్రోలు ధరలు, చెత్త, ఆస్తిపన్నులు పెంచారని విమర్శించారు. అమ్మఒడిలో రూ.2000 కోత పెట్టారని, రైతులకు సబ్సిడీలు అందడం లేదని, పైగా విద్యుత్ మీటర్లు పెడుతున్నారని అన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో నోరెత్తలేదని, కనీసం అడిగే ధైర్యం కూడా చేయలేకపోయారన్నారు. పోలవరం నిధుల ప్రస్తావన లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించకుండా మిషన్ 2024, టార్గెట్ 175 అంటూ ఎన్నికల నగారా మోగించడం ప్రజలకు మేలు చేయదన్నారు. నేడు మిషన్ ఆంధ్రప్రదేశ్ కావాలని, రాష్ట్రం హక్కులు కాపాడాలని, కేంద్రం విద్రోహం నుండి కాపాడాలని తెలిపారు. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆవైపు ఆలోచించకపోతే వైసిపి ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్ మాట్లాడుతూ ఒకరిని ఒకరు బూతులు తిట్టుకోవడం కోసం సభలు జరపడం, కోట్లాది రూపాయలు వెచ్చించి జనాన్ని సమీకరించడం అవసరమా అని ప్రశ్నించారు. అధికార పార్టీ ప్లీనం అంటే రాష్ట్ర సమస్యలపై ఏం చర్చిస్తారు. కేంద్రాన్ని ఏం అడుగుతారు అని ప్రజలు ఎదురు చూస్తారని కానీ ప్లీనం మొత్తం ఆత్మస్తుతి పరనిందలా సాగిందన్నారు. దీనివల్ల ప్రజలకు ఏం ఉపయోగమని ప్రశ్నించారు. వైసిపి, టిడిపి ప్రజల గురించి ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్రంగా ఉందని, యువత ముంబయి, బెంగుళూరు, పూనా, చెన్నై వైపు ఉపాధి కోసం వెళుతున్నారని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మొదటి స్థానంలో రావడం అంటే ఉద్యోగులను కార్మికులను వారి హక్కులను తొక్కి పడేస్తున్నారని అన్నారు. 50 లక్షల మందికి కనీస వేతనాలు అందడం లేదని,. కార్మిక శాఖ నిర్వీర్యం అయిందని అన్నారు. తెలంగాణాలో మాదిరి వేతనాలు లేవని, కనీసం నిరసన వ్యక్తం చేసే హక్కులూ లేకుండా చేశారన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ద్వారా స్వప్రయోజనం పొందడం కోసం వైసిపిని నమ్మి ఓట్లు వేసిన ముస్లిములు, క్రైస్తవులకు, పట్టుబట్టి గెలిపించిన కార్మికులు, ఉద్యోగులకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డి పాలనలో మైనారిటీలు త్రిశంకుస్వర్గంలో ఉన్నారన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరిస్తేనే భవిష్యత్ ఉంటుందని, వారిని బలవంతంగా అణచివేయాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.

**నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నాలు**

గత 40 రోజులుగా సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా 400 మండలాలు, 70 పట్టణాలు, 1200 వార్డులు, 3500 గ్రామాల్లో ఐదు లక్షలకుపైగా కుటుంబాలను కలిసి నిర్వహించిన సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ముగింట సమస్యలు తోరణాలుగా దర్శనమిచ్చాయన్నారు. మండిపోతున్న ధరలు, ప్రభుత్వాలు వేస్తున్న అధిక భారాలతో జనం కుంగిపోతున్నారని తెలిపారు. మహిళలు, వృద్ధులు వారికి జరుగుతున్న అన్యాయంపై కన్నీరు మున్నీరయ్యారన్నారు. ఉపాధి లేని యువత పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. పేదవారు నివాసం ఉంటున్న పట్టాలు లేని ఇళ్ల గురించి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు నిధులు లేకపోవడం, స్థలం ఊరికి దూరంగా ఉండటంవల్ల ఎదురవుతున్న సమస్యల గురించి సిపిఎం నాయకత్వానికి ప్రజలు తమ బాధలు వివరించారన్నారు. భారాలు పెరగడంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రభావం తగ్గిపోతోందని, భూసమస్యలు, అటవీహక్కులు, రోడ్డు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారని పేర్కొన్నారు. వాటిని గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించామని పేర్కొన్నారు. మండల కార్యాలయాల వద్ద ధర్నాలూ జరిగాయని, దానిలో భాగంగానే సోమవారం కలెక్టరేట్ల ముందు శాంతియుతంగా ధర్నాలు జరిపి అధికారులకు సమస్యలు వివరించాలని సిపిఎం పిలుపునిచ్చిందని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

= = = =